క్లుప్తంగా

నేడు గడప గడపకు..

బంగారుపాళెం: మండలంలోని మొగిలివారి పల్లె గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉదయం 7 గంటల నుంచి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మొగిలివారిపల్లె, జయంతి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని తెలియజేశారు.

సర్వేయర్‌గా సునీత



చిత్తూరు రూరల్: చిత్తూరు మండల సర్వేయర్‌గా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కుసేంద్ర పుంగనూరుకు బదిలీ అయ్యారు. కలెక్టరేట్ ఏడీ కార్యాలయ డిప్యూటీ సర్వేయర్ సునీత ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

బీమా రెన్యూవల్ పూర్తి చేయండి

చిత్తూరు రూరల్: బీమా రెన్యూవల్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్లు విధిగా సర్వే పూర్తిచేసేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. బయోమెట్రిక్ పనిచేయని పక్షంలో ఐరిష్, ముఖ ఆధారిత, ఓటీపీ ఆధారంగా కూడా సర్వేను పూర్తి చేయాలని సూచించారు.

వసతి గృహాలకు అంబేడ్కర్ పుస్తకాలు



సాంఘిక సంక్షేమ శాఖ డీడీకి పుస్తకం ఇస్తున్న రచయిత

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ఎస్సీ వసతి గృహాలకు 'సాంఘికశాస్త్ర విప్లవమూర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్' పుస్తకాలను రచయిత వెంకటరమణ వితరణ చేశారు. ఆయన రచించిన ఆ పుస్తకాన్ని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో ఆ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి ఆవిష్కరించారు. అనంతరం వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ, తనది పూతలపట్టు మండలం పాటూరు అని తెలిపారు. అంబేడ్కర్‌పై ఉన్న మక్కువతో పుస్తకాన్ని రచించి వసతి గృహాలకు ఇస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో బుధవారం ఎస్ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో వెంకటాచలపతి నాయుడు (65) అనే వ్యక్తి నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లకుంటలో ఘనంగా జాతర



ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని నీళ్లకుంటలో మంగళవారం జాతర ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మి రాజేష్, గంగమ్మ ఆలయ చైర్మన్ కందల నరేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖఃసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర తెలిపారు.మాజీ కౌన్సిలర్ శాంతమ్మ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నేరం



నగరిలో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ

నగరి: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిరాజు హెచ్చరించారు. బుధవారం నగరి డివిజన్ పరిధిలోని లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫామ్–ఎఫ్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు స్కానింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ డీఈడీఓ, సిబ్బంది ఉన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో కుంభాభిషేక పూజల్లో భాగంగా బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు.

ప్రతి భక్తునికీ 'జలప్రసాదం'

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- రూ.64.50లక్షలతో 4 జల ప్రసాద కేంద్రాలు ప్రారంభం

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యం జలప్రసాదం ఇవ్వనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆలయ పరిసరాలలో నాలుగు చోట్ల రూ.64.50లక్షలతో జలప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిని ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. ఎమ్మెల్యే జల ప్రసాదాన్ని సేవించారు. స్వామివారి తీర్థంలా ఉందని ఆయన పేర్కొన్నారు. జల ప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రైవేటు కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఐరాల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, స్థానిక ఉపసర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.



జలప్రసాద కేంద్రం వద్ద పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చక వేదపండితులు, ఉభయదారులు

వరసిద్ధుని సేవలో ఎమ్మెల్యే, జల ప్రసాద దాతలు

పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జలప్రసాద నిర్మాణ కర్తలైన హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ సభ్యులు శ్రీనివాసులుకు ఆలయ చైర్మన్, ఈఓ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.



ఎమ్మెల్యే బాబు, జలప్రసాద దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. జిల్లా మలేరియా విభాగంతో కలసి వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, ఆరోగ్య కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. రానున్నది వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించి సమర్పించాలన్నారు. ప్రధానంగా వార్డుల వారీగా డ్రైనేజీల్లో పూడికతీత వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాల గుర్తించి ఆ ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, అలాగే క్షేత్రస్థాయిలో వీటిపై వలంటీర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు అవగాహన కల్పించాలన్నారు. దోమల నిర్మూలన, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయడంలో తీసుకోవలసిన మెళకువలపై జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు దృశ్య మాధ్యమం ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి పీరూసాహెబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు



రంగంపేట ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న పూతలపట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక

- ఆర్‌ఎంపీలకు వైద్యాధికారి వార్నింగ్

పూతలపట్టు: ప్రజల ఆరోగ్యంతో ఆర్‌ఎంపీలు చెలగాటం ఆడరాదని వైద్యాధికారి ప్రియాంక హెచ్చరించారు. బుధవారం మండలంలోని రంగంపేట క్రాస్, పూతలపట్టు, బండపల్లెలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీల క్లినిక్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, అయితే రోగులకు ఇంజెక్షన్లు వేయడం, సెలైన్లు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటి వల్ల రోగుల ప్రాణాల మీదకు వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల వద్ద వైద్యం పొందాలని అక్కడి రోగులకు హితవు పలికారు.ఆర్ఎంపీలు, పీఎంపీలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, ఎంపీహెచ్ఈఓ మోహన్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై గ్రామసభలు



మాట్లాడుతున్న భూ రీసర్వే డీటీ వెంకటరమణ

తవణంపల్లె: జగన్న భూ రక్ష–జగన్న భూశాశ్వత హక్కు పథకం కింద భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తవణంపల్లె భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ కోరారు. బుధవారం మండలంలోని పైమాఘం, గాజులపల్లె, తొడతర, సరకల్లు రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మండలంలో మూడవ విడత కింద పైమాఘం, గండుపల్లె, సరకల్లు, దిగువ తడకర, ఈచనేరి రెవెన్యూ గ్రామాలు ఎంపికయ్యాయని, ఈ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి భూ రీసర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు. భూ రీసర్వేలో రైతులు తమ రికార్డులను చూపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సతీష్ రెడ్డిమల్లు దొరై, సురేష్, ఎంపీటీసీ, రైతులు పాల్గొన్నారు.

10న శ్రీవేంకటేశ్వర కల్యాణం

రామకుప్పం: మండలంలోని విజలాపురం మురుగేష్ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీలక్ష్మీ పద్మావతీదేవీ, శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఉన్సిగాని పల్లె తిమ్మ రాయస్వామి, చౌడేశ్వరీ దేవస్థానం ఆలయ ధర్మకర్త గుర్రప్ప శెట్టి తెలిపారు. టీడీడీ వేద పండితుల వేదపారాయణం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



కె.పట్నంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నం రైతు భరోసా కేంద్రంలో బుధవారం సాయంత్రం రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కేంద్రానికి 530 బస్తాలు వేరుశనగ విత్తనాలు సరఫరా చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి, పార్టీ నాయకులు ప్రకాష్ బాబురెడ్డి, సుకేష్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులకు తెగుళ్ల దెబ్బ



కొబ్బరికాయలపై ఉన్న నల్లమచ్చలు

గుడిపాల: మండలంలో కొబ్బరి తోటలకు తెగుళ్లు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవికాలంలో కొబ్బరికాయలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఈ సమయంలో తెగుళ్లు ఆశించడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. వరి, మామిడి, చెరకు రైతులతో పాటు కొబ్బరిసాగు రైతులు కూడా నల్లతెగులుతో ఆందోళన చెందుతున్నారు. కొబ్బరి చెట్లు సాగు చేయడానికి తక్కువ నీరు, తక్కువ ఖర్చు అవుతుంది. కష్టపడి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు లభించక, కొందరు రైతులు సాగు భూమిలో కొబ్బరిచెట్లు పెంచారు. ఈ ఏడాది కొబ్బరికాయల రేట్లు అధికంగా ఉన్నా కాయలపై నల్లమచ్చలు ఉండడంతో సరైన ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో శ్రీరంగంపల్లె, 189కొత్తపల్లె, వసంతాపురం, నంగమంగళం, మందిక్రిష్టాపురం, చింతగుంటూరు, కోలావూరు గ్రామాల్లో అధికసంఖ్యలో కొబ్బరిసాగు ఉంది. తెగులు నివారణకు ఉద్యానవనశాఖ అధికారులు సరైన అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

రూ.కోటికి పైగా వ్యాపారంతో రికార్డు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

- మహిళా మార్ట్ సిబ్బందిని అభినందించిన డీఆర్‌డీఏ పీడీ తులసి

తవణంపల్లె: చేయూత మహిళా మార్ట్ వ్యాపారాల విస్తరణకు సంఘ సభ్యులు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. బుధవారం తవణంపల్లెలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసి మాట్లాడారు. తవణంపల్లె సంఘ సభ్యుల సహకారంతో చేయూత మహిళా మార్ట్‌లో తక్కువ రోజుల్లోనే కోటి రూపాయలకు పైగా వ్యాపారం చేసి రికార్డు సృష్టించారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో తక్కువ ధరలకు నాణ్యమైన సరకులను విక్రయించి, వ్యాపారపరంగా ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య లీడర్లు, సంఘమిత్రలు, సంఘ సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ రవి, ఐబీ డీపీడి వెంకటేష్, చేయూత డీపీఎం రవి, ఏపీఎం సీసీలు, మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



గణపతి పూజ చేస్తున్న వేదపండితులు



విశేష అలంకరణలో వినాయకస్వామి

గుడిపాల: మండలంలో నరహరిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలోని వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు. గణపతిపూజ, వాల్మీకిపూజ, అంకురార్పణ, గోపూజలను వేదపండితుల శాస్త్రోక్తంగా నిర్వహించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ,ఎస్ఐ రాజశేఖర్, నరహరిపేట గ్రామస్తులు కుంభాభిషేక పూజలకు హాజరయ్యారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రజనీకాంత్, తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మొగిలిరెడ్డి, సాయి, శంభు, రెడ్డెప్ప, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా జాతర



బంగారుపాళెం: దళితవాడలో నడివీధిలో కొలువు దీరిన గంగమ్మ



తవణంపల్లె : ఎగువ తవణంపల్లెలో..

బంగారుపాళెం: స్థానిక దళితవాడలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి ఊరేగించారు. బుధవారం తెల్లవారు జామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉట్ల తిరునాళ్లను నిర్వహించారు. ఉట్లమాను అధిరోహించేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం రాత్రి అమ్మవారిని మేళతాళాలు, బాణాసంచా మోత నడుమ జలప్రవేశానికి తరలించారు. అలాగే మండలంలోని తుంబకుప్పంలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనం

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లెలో బుధవారం సాయంత్రం గంగమ్మను కోలాహలంగా నిమజ్జనం చేశారు. రెండ్రోజుల పాటు గ్రామస్తులు గంగజాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మ వారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, గండ దీపాలు వెలిగించి, నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని విద్యుద్దీపాలంకరణతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పటాలమ్మ తల్లీ.. పాహిమాం



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అశేష భక్తులు

పెద్దపంజాణి: రాయలపేట గ్రామంలో శ్రీపటాలమ్మ గంగజాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున మండపంలో అమ్మవారు కొలువుదీరగా భక్తులు అశేషంగా తరలి వచ్చి దర్శించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని మారెమ్మ ఆలయం నుంచి ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ బజారు వీధి మీదుగా సాగి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని కొలువుదీర్చారు. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణసంచా, సౌండ్ లైటింగ్, విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబలి సమర్పణ...

అమ్మవారికి ఆలయం ముందు ఏర్పాటు చేసిన పెద్ద డ్రమ్ముల్లో భక్తులు ఇంటి నుంచి తీసుకువచ్చిన అంబలి పోసి మొక్కులు చెల్లించారు. అంబలిని ప్రసాదంగా ఇళ్లకు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, ఆంజమ్మ, సింగిల్‌విండో చైర్మెన్ ఓబుల్‌రెడ్డి, మాజీ చైర్మెన్ శంకరప్ప, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జిల్లా కార్యదర్శులు తమ్మరెడ్డి, సుహేబ్, మాకయ్య, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు

నేడు నిమజ్జనం...

రెండు రోజులపాటు నిర్వహించిన గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో పరిసమాప్తం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులోని బావిలో నిమజ్జనం చేయనున్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్' వైద్యసేవలు





గుడిపాల: 197రామాపురంలో.., తవణంపల్లె : దిగువమాఘంలో రోగులకు పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డాక్టర్ పవన్‌కుమార్ నిర్వహించారు. షుగర్, బీపీ రోగులకు రక్త పరీక్షలు చేసి నెలకు సరిపడా మాత్రలను ఉచితంగా అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగులకు ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఆశా వర్కర్ అశ్విని, అనురాధ, శశికళ పాల్గొన్నారు.

యం.బండపల్లెలో..

పూతలపట్టు: మండలంలోని యం.బండపల్లె విలేజ్ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పూతలపట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక నిర్వహించారు. 52 మంది రోగులను పరీక్షించి మందులు, మాత్రలు, గర్భవతులకు, బాలింతలకు ఐరన్ పోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హెల్తాఫీసర్ శ్రీనివాసమూర్తి, దయాకర్‌రెడ్డి, అంజలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెం మండలంలో..

బంగారుపాళెం: మండలంలోని కాటప్పగారిపల్లె, ముంగరమడుగు గ్రామాల్లో బుధవారం తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, ఎఫ్‌పీసీ డాక్టర్ రమేష్ గర్భవతులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇంటికి వెళ్లి పరీక్షించారు. ఆరోగ్య, 104 సిబ్బంది పాల్గొన్నారు.

దిగువమాఘంలో..

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక సూచించారు. బుధవారం మండలంలోని దిగువమాఘంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 65 మంది రోగులతోపాటు గర్భవతులు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, అనసూయ,మురళమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కుసుమ, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు శారద, కవిత, సురేఖ, మల్లిక పాల్గొన్నారు.

గోవిందరెడ్డిపల్లెలో..

ఐరాల: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 80 మంది రోగులకు, గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్తపోటు వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్

పలమనేరు: పలమనేరు పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకమండలి కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ సమీపంలో ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్‌కు 33 ఎకరాల భూ కేటాయింపులకు కృషి చేస్తున్నామన్నారు. వీ.కోట మండలంలోని శివుని కుప్పం మ్యాంగో మార్కెట్, రాయల పేట మార్కెట్ ప్రహరీగోడ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలో రైతుబజారు ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. స్థానికంగా వాణిజ్య సముదాయ నిర్మాణం తదితరాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి సంజీవకుమార్, ఉపాధ్యక్షులు పుష్పలత ఆంజనేయులు, కమిటీ సభ్యులు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.